

మార్లవాయి సందర్శన

జైనూర్: మండలంలోని మార్లవాయి గ్రామాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ వేణు సందర్శించారు. హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు.



పత్తి చేలపై కలుపు కత్తి

పత్తిలో కలుపు పెరిగి పంట ఎదుగుదలను బలహీన పరుస్తున్నాయి. కొందరు రైతులు రసాయనిక మందులు పిచికారీ చేసి కలుపును నివారిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.5 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆసక్తిగా సిర్పూర్ పోరు

- బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ మధ్యే అసలు పోటీ
- కాంగ్రెస్ ప్రభావం అంతంత మాత్రమేనా?
- వరుస విజయాలతో ఎమ్మెల్యే కోనప్ప..
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు గెలుపు కీలకం..
- బీజేపీ నుంచి పరిశీలనలో ఇద్దరి పేర్లు
- సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్న నేతలు



కోనేరు కోనప్ప



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



కొత్తపల్లి శ్రీనివాస్



పాల్వాయి హరీశ్‌బాబు

సాక్షి, ఆసిఫాబాద్: రాష్ట్రంలో ఉత్కంఠ రేపిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా వెల్లడికావడంతో సిర్పూర్ సెగ్మెంటులో ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం తొణికిసలాడుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్పకే మళ్లీ టికెట్ ఖరారు కావడంతో ఇప్పుడాయనకు పోటీగా విపక్ష పార్టీ అభ్యర్థులెవరనే ప్రశ్న చర్చనీయాంశమైంది. ఇప్పటికే వరుసగా రెండుసార్లు గెలిచిన కోనప్పకు ఈసారి బీజేపీ, బీఎస్పీల రూపంలో గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే అధికార, విపక్ష పార్టీల నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో నియోజకవర్గంలో రాజకీయ వేడి క్రమంగా రాజుకుంటుంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు మరింత ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా సిర్పూర్ సింహబలుడెవరన్నది తేలుతుందని వారు అంటున్నారు.

17 సార్లు ఎన్నికలు

సిర్పూర్ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 1957లో ద్విసభ్య నియోజకవర్గంగా రూపాంతరం చెంది, తిరిగి 1962లో జనరల్ నియోజకవర్గంగా ఏర్పడింది. 2010లో జరిగిన ఉప ఎన్నికతో సహా ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 1972, 1978 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కె.వి.శేషవులు దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకి అత్యంత సన్నిహితులు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇక్కడ ఆరుసార్లు గెలువగా.. టీఆర్‌ఎస్, టీడీపీ మూడేసి సార్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి రెండుసార్లు, పీఎస్‌పీ, సోషలిస్ట్, బీఎస్పీ పార్టీలు ఒక్కోసారి గెలిచాయి. కాంగ్రెస్, బీఎస్పీ, టీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కోనేరు కోనప్ప తాజాగా నాలుగోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

కోనప్పకు ఎదురుందా!

సిర్పూర్ నియోజకవర్గంలో అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా పేరొందిన కోనేరు కోనప్పకు ఈసారి జరగనున్న ఎన్నికలు ఆషామాషీగా ఉండవని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 2.17 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో బీసీ, ఎంబీసీ, డీఎన్‌టీ కులాలకు చెందిన ఓటర్లు 60 శాతంపైగా ఉన్నారు. ఈ కులాల్లో అత్యధికంగా మహాత్మా జ్యోతిబా పూలే సామాజిక వర్గానికి చెందిన మాలి కులస్తులు 28 వేల ఓటర్లు ఉన్నారు. ఎస్సీలు 53 వేలు, ఎస్టీలు 27 వేల వరకు ఉన్నట్లు సమాచారం. అలాగే ఆరె సామాజికవర్గానికి చెందిన ఓటర్లు 40 వేలకు పైగా ఉన్నారు. ఇక ముస్లిం ఓటర్లు సైతం 35 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరి ఓట్లు సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయంలో కీలకపాత్ర పోషించనున్నాయి. కాగా, బీఆర్‌ఎస్‌కు సంస్థాగతంగా బూత్‌స్థాయి నుంచి మండలస్థాయి వరకు బలమైన క్యాడర్ ఉండడం కొంత కలిసొచ్చే అంశం.

పాల్వాయి కుటుంబానికి పట్టు..

ఆది నుంచి నియోజకవర్గంలో డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు కుటుంబానికి మంచి పట్టుంది. హరీశ్‌బాబు తండ్రి పాల్వాయి పురుషోత్తంరావు స్థానికుడు. 1989, 1994 ఎన్నికల్లో పురుషోత్తంరావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన భార్య పాల్వాయి రాజ్యలక్ష్మి సైతం 1999లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. వరుసగా ఆ కుటుంబసభ్యులు మూడుసార్లు గెలవడం నియోజకవర్గంలో వారికున్న పట్టుకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి పాల్వాయి హరీశ్‌బాబుకు టికెట్ దక్కితే హోరాహోరీ పోరు ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్‌ఎస్పీ సైతం ఇక్కడి నుంచే..

మరోవైపు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ నుంచే పోటీ చేస్తానని ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు చాపకింద నీరులా నియోజకవర్గంలో తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. నిన్నటి వరకు ఎమ్మెల్యే కోనప్పకు అండగా నిలిచిన పొరుగు రాష్ట్రానికి ఆనుకుని ఉన్న కొటాల మండలం గుండాయిపేట, మొగడ్‌దగడ్, తుమ్మిడిహెట్టి, వీర్దండి, తాటిపల్లి గ్రామాల ఓటర్లు బీఎస్పీ వైపు మొగ్గు చూపుతునట్లు తెలుస్తోంది. పైగా ఇక్కడి ఓటర్లు మాటిస్తే వందశాతం ఓట్లు వేస్తారన్న నమ్మకం ఉంది. చింతలమానెపల్లి మండలం బూరెపల్లి గ్రామం ఎస్టీ వర్గానికి చెందిన సిడాం గణపతి(ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్)సైతం ఈ ఎన్నికల్లో బీఎస్పీకి మద్దతు ఇస్తున్నారు. బెజ్జూర్‌కు చెందిన మాజీ ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘం చైర్మన్ హర్షద్ ఉస్సేన్ బీఎస్పీలో కీలకంగా మారడంతో సిర్పూర్(టి), బెజ్జూర్, కాగజ్‌నగర్‌లో ఉన్న ముస్లిం ఓట్లు కొంత బీఎస్పీకి పడే అవకాశాన్ని కొట్టిపారేయలేమని రాజకీయ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పోటీ తీవ్రం

సిర్పూర్ నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీల మధ్యే పోటీ ఉండనుంది. బీజేపీ నుంచి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌లో ఎవరో ఒకరు బరిలో నిలవనుండగా.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుంచే పోటీ చేయనున్నారు. ఈ ముగ్గురు మధ్యే త్రిముఖ పోటీ ఉండనుంది. కమ్మ సామాజికవర్గానికి చెందిన కోనప్ప తొలిసారి 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించారు. ఆ తరువాత 2009లో టీఆర్‌ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్య చేతిలో 7,414 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2014లో బీఎస్పీ తరఫున పోటీ చేసిన కోనప్ప తమ సమీప టీఆర్‌ఎస్ అభ్యర్థి కావేటి సమ్మయ్యపై 8,837 ఓట్ల మెజార్టీతో గెలుపొంది ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నారు. ఆ తరువాత ఆయన టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కోనప్ప తమ సమీప కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుపై 24,036 ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించారు. అనంతరం హరీశ్‌బాబు బీజేపీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీలో సగానికిపైగా శ్రేణులు ఆయన వెంటే నడిచాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఫలితంగా నియోజకవర్గంలో బీజేపీ, అధికార పార్టీకి ప్రధాన ప్రతిపక్షంగా మారింది.

కాంగ్రెస్ నుంచి ఎవరో..?

కాంగ్రెస్‌లో టికెట్ ఆశిస్తున్న రావి శ్రీనివాస్, కోర్లకృష్ణారెడ్డి ఇద్దరూ క్షేత్రస్థాయిలో విభేదాలకు అతీతంగా పనిచేసుకుపోతున్నారు. ఈ ఇద్దరు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, విశ్వప్రసాద్‌కు సన్నిహితులుగానే గుర్తింపు పొందారు. ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేయాలన్న ఏకాభిప్రాయంతో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు యూనుస్ హుస్సేన్ కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

జైనూర్(ఆసిఫాబాద్): వైద్యసిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు పరిశీలించి, వైద్యసేవల గురించి ఆరా తీశారు. అనంతరం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి జితేందర్ రెడ్డి, అధికారులు గణేశ్, రమేశ్, దిలీప్‌కుమార్, సాంబలక్ష్మి తదితరులు ఉన్నారు.

‘సమ్మెకు భగీరథ కార్మికులు సిద్ధం’

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎల్‌ఎంటీ కంపెనీ యాజమాన్యంతో చర్చలు విఫలం కావడంతో భగీరథ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ ప్రకటించారు. రెండు గంటల పాటు సాగిన చర్చల అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలోనే యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించామన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆసిఫాబాద్ సెగ్మెంట్ పరిధిలోని 600 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్తారని పేర్కొన్నారు. ప్రతినెలా 5లోగా వేతనాలు చెల్లించాలని, జీవో 60 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం, డిపార్ట్‌మెంట్ అధికారులు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం లింగయ్య, నాయకులు సురేశ్, బాబాసాహెబ్, సంతోష్, బుద్దయ్య, హరీశ్‌బాబు, శ్రీకాంత్, బాలేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీఎస్పీగా రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ అదనపు డీఎస్పీగా రమేశ్‌కుమార్ బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది డీఎస్పీలకు కొత్త స్థానాలకు కేటాయిస్తూ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

‘సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం’



కలెక్టరేట్ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎమ్మెల్యే దేవ్‌రావు హోలీ అన్నారు. ‘కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో’ అనే నినాదంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, అర్హులైన వారికి దళితబంధు వర్తింపజేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారాంనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, నాయకులు కొలిపాక కిరణ్, రమేశ్ గౌడ్, సునీల్‌చౌదరి, ఖాండ్రే విశాల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పులి దాడిలో ఆవు హతం

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ శివారు ప్రాంతంలో ఓ ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గ్రామానికి చెందిన గోళ్లే హన్మంతు గురువారం తన ఆవును మేతకు వదలగా గ్రామ శివారు ప్రాంతంలో పులి దాడి చేసి చంపింది. నెలరోజుల్లో పులి దాడిలో మూడు మేకలు, ఐదు ఎద్దులు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆవు కళేబరాన్ని పరిశీలించి వివరాలు సేకరించినట్లు కాగజ్‌నగర్ రేంజ్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. బాధిత రైతుకు పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు. పులి సంచారం నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి పూట ఒంటరిగా బయట తిరగొద్దని ఆయన సూచించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ఓటరు నమోదుకు వివరాలు అందించిన కలెక్టర్ దంపతులు



ఫారం- 6 అందిస్తున్న కలెక్టర్ దంపతులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో 18 నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కు పొందాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సతీమణి రేవతితో ఆయన ఓటు నమోదు కోసం బీఎల్‌వోకు ఫారం- 6 అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అర్హులు బూత్‌స్థాయి అధికారులకు తమ వివరాలు అందించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-363 పనులు పరిశీలించిన రీజినల్ అధికారి

నస్పూర్: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బైపాస్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు గోయగాం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్-363 పనులను ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) రీజినల్ ఆఫీసర్(హైదరాబాద్) ఎస్‌కే.రజాక్ శుక్రవారం పరిశీలించారు. శ్రీరాంపూర్ వంతెన నిర్మాణం, పనుల్లో జరుగుతున్న జాప్యం, తరచూ జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలు, మందమర్రి టోల్‌ప్లాజా నిర్వహణ, టోల్ వసూళ్లు, రేపల్లెవాడ తెలంగాణ–మహారాష్ట్ర బోర్డర్ వరకు నేషనల్ హైవే పనుల నాణ్యత, పనిలో అలసత్వంపై అధికారులను అడిగి వివరాలు సేకరించారు. కుమురంభీం జిల్లా వాంకిడి మండలం సరండి వద్ద త్వరలో ప్రారంభం కానున్న టోల్‌ప్లాజా పనులు, అనిమల్ అండర్ పాస్, ఓవర్ పాస్ పనులపై ఆరా తీశారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత ప్రణాళికతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ కేఎస్ అజయ్‌మణికుమార్, సైట్ ఇంజనీర్లు, కాంట్రాక్ట్ అధికారులు పాల్గొన్నారు.





భక్తిశ్రద్ధలతో ‘వరలక్ష్మి’ పూజలు

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మి వ్రత పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌తోపాటు ఆలయాలు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నివాసంలో జెడ్పీటీసీ కోవ అరుణ, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
- ఆసిఫాబాద్

సమ్మె శిబిరంలో వరలక్ష్మీ వ్రతం

- కొనసాగుతున్న సెకండ్ ఏఎన్‌ఎంల ఆందోళనలు



కలెక్టరేట్ ఎదుట సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్: సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన సెకండ్ ఏఎన్‌ఎంలు శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలోనే సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడిపాడి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి షరతులు లేకుండా ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ.. ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలపై చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, తెలంగాణ ఏఎన్‌ఎంల యూనియన్ రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, నాయకులు పుణ్యవతి, భాగ్యరజిని, రాధ, పద్మ, సునీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, తదితరులు

తిర్యాణి(ఆసిఫాబాద్): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా తిర్యాణి మండలం గడలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారానే కుటుంబ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్ రావు, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ నరేందర్, ఎస్సై రమేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, జిల్లా సార్‌మెడి మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయకుంటే నిరవధిక సమ్మె

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 15 నుంచి 20 ఏళ్లుగా సేవలందిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని శుక్రవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్యను వేర్వేరుగా కలిసి సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాటర్ సప్లై వర్కర్లు, ఎలక్ట్రికల్ వర్కర్లు, బిల్లు కలెక్టర్లు, సిస్టం మేనేజర్లు, అసిస్టెంట్లుగా పనిచేస్తున్నామన్నారు. రెగ్యులరైజ్ చేసే వరకు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు విధులు నిర్వహిస్తూనే శాంతియుతంగా సమ్మె చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే సెప్టెంబర్ 1 నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని తెలిపారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మనోహర్

కాగజ్‌నగర్‌టౌన్: బీఎస్పీ కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నక్క మనోహర్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, ఉత్తర తెలంగాణ చేరికల కమిటీ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కొండా రాంప్రసాద్, కమలే గౌతంను జిల్లా కార్యదర్శులుగా నియమించినట్లు వారు వెల్లడించారు.

ప్రతీ ఓటు పక్కా!

- పౌరులందరూ ఓటేసేలా ప్రచారం
- ఓటరుగా నమోదు, వినియోగంపై అవగాహన
- ప్రచార కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా చర్యలు



దహెగాంలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కవిత

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్న ఓటర్లు తప్పనిసరిగా ఎన్నికల్లో పాల్గొనేలా జాగృతం చేస్తోంది. ఎన్నికల సంఘం ‘నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్’ నినాదంతో పలు ప్రచార కార్యక్రమాల్లో చేపడుతోంది. ఈవీఎంల ప్రదర్శన నిర్వహిస్తోంది. వచ్చే ఎన్నికల దృష్ట్యా అధికారులు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. ఈ నెల 21న సవరించిన ఓటరు ముసాయిదా జాబితా ప్రచురించారు. తుది జాబితా అక్టోబర్‌లో వెలువడనుంది. ఆ జాబితాలో ఉన్న వారికే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. దీంతో ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తున్నారు. కొత్త, పాత వాళ్లు తమ ఓటరులో మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరుతున్నారు. ఇందుకోసం సంబంధిత ఫారాలు నింపి బూత్ స్థాయి అధికారులకు ఇవ్వాలని సూచిస్తున్నారు.

పోలింగ్ శాతం

నియోజకవర్గం	2014	2018	తాజా ముసాయిదా ప్రకారం ఓటర్లు
సిర్పూర్	78.88	85.93	2,17,551
ఆసిఫాబాద్(ఎస్టీ)	77.10	86.00	2,14,104
బోథ్(ఎస్టీ)	79.91	85.29	2,05,022
ముథోల్	78.76	84.02	2,36,130
బెల్లంపల్లి(ఎస్సీ)	73.85	83.10	1,62,069
చెన్నూరు(ఎస్సీ)	72.73	82.32	1,77,761
ఆదిలాబాద్	63.88	81.64	2,29,249
ఖానాపూర్(ఎస్టీ)	73.77	80.50	2,10,143
నిర్మల్	76.89	79.13	2,37,575
మంచిర్యాల	64.62	73.17	2,50,790
మొత్తం	74.04	82.11	21,43,394

వందశాతం లక్ష్యంగా..

వంద శాతం పోలింగ్ లక్ష్యంగా అధికారులు ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేస్తేనే ఈ లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. 2018 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో సగటున 82.11 శాతం పోలింగ్ నమోదైంది. మంచిర్యాలలో మినహా అన్ని నియోజకవర్గాల్లో 80 శాతం దాటింది. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ బూత్‌లలో 90శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. కుమురంభీం జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ 71వ బూత్‌లో ఏకంగా 100 శాతం ఓట్లు పోలయ్యాయి. అక్కడున్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇలా ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో అందరూ ఓటేస్తే వంద శాతం లక్ష్యం చేరుకోవడం సులువేనని అధికారులు చెబుతున్నారు.

పట్టణాల్లోనే వెనుకబాటు

గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో చాలామంది ఓటర్లు ఇంకా ఓటుకు దూరంగా ఉంటున్నారు. వలస వెళ్లిన వారు, ఉద్యోగ, ఉపాధిరీత్యా వేరే చోటు నుంచి వచ్చి ఓటు వేయడంలో అలసత్వం చూపుతున్నారు. అలాంటి వారికి తమ ఓటు హక్కును తామున్న చోటుకే మార్చుకునే అవకాశం ఉంది. కానీ సొంతూరులో ఓటరుగా ఉన్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో పాలుపంచుకోవడం లేదు. మరోవైపు ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లోనూ 90శాతం చేరువకు వెళ్లడం మారుమూల ప్రాంతాల్లో ఓటు విలువ చాటి చెబుతోంది.

ఓటేస్తేనే ప్రశ్నించే హక్కు

ఎన్నికల్లో ఓటేస్తేనే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందనే అవగాహన ప్రతీ ఒక్కరిలో పెంపొందించాల్సి ఉంది. తమను పాలించే వారిని ఎన్నుకోవడంలో అలసత్వం చూపొద్దనే భావన ప్రతీ ఒక్కరిలో రావాల్సి ఉంది. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు పౌరులకు ఓటు విలువపై మరింత విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కోతకు వచ్చిన ఆయిల్‌పాం


పంట కొనుగోలు చేస్తున్న వ్యాపారి

మందమర్రిరూరల్: మండలంలోని అందుగుల పేటకు చెందిన రైతు ఏనుగు ఆశిరెడ్డికి సంబంధించిన ఆయిల్‌పాం తోట కోతకు వచ్చింది. శుక్రవారం వ్యాపారులు గ్రామానికి వచ్చి తోటను సందర్శించి పంట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రైతు ఆశిరెడ్డి మాట్లాడుతూ.. 2020 ఆగస్టులో ఐదెకరాల్లో 285 మొక్కలు నాటగా మూడేళ్లలో మొదటి కోత రావడం సంతోషంగా ఉందన్నారు. వారి వెంట హార్టికల్చర్ ఆఫీసర్ తిరుపతి తదితరులున్నారు.

చంద్రయాన్‌-3 శాస్త్రవేత్త చంద్రశేఖర్‌కు సన్మానం


శాస్త్రవేత్త చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: చంద్రయాన్‌–3 ప్రయోగంలో భాగస్వామి అయిన మంచిర్యాలకు చెందిన శాస్త్రవేత్త మల్యాల చంద్రశేఖర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. మంచిర్యాలలో నివాసముంటూ 18 ఏళ్లుగా ఇస్రోలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం త్రివేండ్రం ఇస్రోలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రయాన్‌–3 ప్రయోగంలో తనవంతు భాగస్వామ్యం ఉండడం ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో ఖేల్‌కూద్ నిర్వహణకు రూ.10వేలను విరాళంగా అందించారు. పాఠశాల ప్రబంధకారిణి కార్యదర్శి చందూరి మహేందర్, చంద్రశేఖర్ సోదరులు విజయ్ భాస్కర్, మధుకుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 31వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకే దరఖాస్తు చేసినవారు క్యాస్ట్ కేటగిరీ, పరీక్ష రాసే భాష, పట్టణ/గ్రామీణం తప్పుగా నమోదు చేసి ఉంటే సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఆన్‌లైన్‌లో సవరించుకునే అవకాశం విద్యాలయం కల్పించిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పత్తిచేలపై కలుపు కత్తి..!

- నివారించకుంటే తీవ్ర నష్టం
- తగ్గిపోనున్న పంట ఎదుగుదల
- ప్రాథమిక దశలో గుర్తిస్తే మేలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 11లక్షల ఎకరాల్లో సాగు


నెన్నెలలో పత్తిలో గుంటుకతో దౌర కొడుతున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రైతులు ఖరీఫ్‌లో ప్రధానంగా అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తారు. ఈ ఏడాది 11 లక్షల ఎకరాల్లో సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 10.50 లక్షల ఎకరాల వరకు విత్తుకున్నారు. ప్రస్తుతం పంట 60 రోజులకు చేరి ఎదిగే దశలో ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంటలో విపరీతమైన కలుపు పెరిగింది. మొలక దశ నుంచే వివిధ రకాల గడ్డి మొక్కలు పెరిగి పంట ఎదుగుదలను బలహీనపరుస్తున్నాయి. కొంతమంది రైతులు కలుపు మొక్కలను కూలీలతో నివారిస్తున్నారు. మరికొంత మంది రైతులు గుంటుకతో దౌర కొడుతున్నారు. కూలీలు, ఎడ్లు అరకలు దొరకని రైతులు రసాయనిక మందులు పిచికారీ చేసి కలుపును నివారిస్తున్నారు. కలుపు మొక్కలను నివారిస్తేనే పంట ఎదుగుదలకు బలం చేకూరుతుందని శాస్త్రవేత్త కో ఆర్డినేటర్ మోహన్‌దాస్ వివరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి భూముల్లో వర్షాధారంగా పంట సాగవుతోంది. పురుగుల్ని తట్టుకుంటుందన్న కారణంతో రైతులంతా బీటీ హైబ్రిడ్ విత్తనాలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే వరుసల మధ్య ఎడం ఎక్కువగా ఉండడం, అవసరానికి మించి ఎక్కువగా ఎరువులు వేయడం, వర్షాకాలంలో భూమిలో ఎక్కువగా తేమ ఉండడంతో పత్తి చేలో కలుపు మొక్కలు బాగా పెరుగుతున్నాయి. ఇవి పంట పోషక పదార్థాలు, తేమ, సూర్యరశ్మి కోసం మొక్కలతో పోటీ పడుతూ పంటను బలహీన పరిచి దిగుబడిని 50 నుంచి 85 శాతం వరకు తగ్గించే ప్రమాదముంది. తుత్తురుబెండ వంటి కొన్ని రకాల పురుగులు ఆశిస్తున్నాయి. మరికొన్ని కలుపు మొక్కలు తెగుళ్లకు ఆవాసాలుగా మారి వాటి వ్యాప్తికి దోహదపడుతున్నాయి. దీంతో సస్యరక్షణపై పెట్టే ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఈ నేపథ్యంలో యాజమాన్య చర్యలు చేపడితే చీడపీడల ఉధృతిని తగ్గించుకోవడమే కాకుండా దిగుబడుల్ని పెంచుకోవచ్చు. తద్వారా సస్యరక్షణ ఖర్చు కూడా తగ్గుతుంది.

మొదటి 70రోజులే కీలకం

పత్తిలో కలుపు నిర్మూలనకు పంట విత్తిన మొదటి 70 రోజుల సమయం కీలకంగా మారనుంది. పత్తిలో వివిధ రకాల కలుపు మొక్కలు కనిపిస్తుంటాయి. గరిక, చిప్పరగడ్డి, దోమకాలుగడ్డి, నక్షత్ర గడ్డి, పుల్లర గడ్డి, ఊదుర్రంకి, వయ్యారిభామ తదితర కలుపుజాతి గడ్డి మొక్కలు.. తుంగ, శాఖ తుంగ, చెంచలికాడ, పిండికూర, నేల ఉసిరి, తుత్తురబెండ, గలిజేరుకాడ, ఎలుకజెముడు, మురిపిండాకు, పిచ్చిజనుము, తెరణాల మెండ, గాడిదరప తదితర కలుపు మొక్కలు పెరుగుతాయి.

సకాలంలో పిచికారీ చేస్తే..

పంట చేనులో ఎలాంటి కలుపు మొక్కలు ఉన్నాయో గమనించి వాటి నిర్మూలనకు ఏ కలుపు మందు వాడాలో తెలుసుకోవాలి. పంట వేయక ముందు తుంగ, గరిక, మొండి జాతి గడ్డి మొక్కలు ఎక్కువగా ఉంటే వాటిని నిర్మూలించడం కష్టం. కాబట్టి పంట వేసే ముందు, వేసిన 48 గంటల్లోపు పెండెమెథిలిన్ లాంటి మందు పిచికారీ చేయాలి.

కూలీలతో కలుపు నివారణ

పంట దీర్ఘకాలికమైనది కావడంతో ఏ ఒక్క పద్ధతిలోనో కలుపు పూర్తిగా నిర్మూలించలేం. కాబట్టి వివిధ దశల్లో రసాయనిక మందులతోనే కాకుండా.. గుంటుకతో దౌర కొట్టి నిర్మూలించడం, కూలీలతో తొలగించడం చేయాలి. కూలీల కొరత కారణంగా ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి మొక్కలు మొదళ్లలో ఏవైనా కొద్దిపాటి కలుపు మొక్కలు కనిపిస్తే అప్పుడే కూలీలతో కలుపు తీయించవచ్చు. కానీ.. చేను అంతటా విస్తృతంగా పెరిగిన కలుపు మొక్కలను కూలీలతో తొలగించడం కష్టమవుతుంది.

గుంటుకతో దౌర కొట్టి..

పత్తిలో గుంటుకతో దౌర కొట్టే పద్ధతి ద్వారా అతి తక్కువ ఖర్చుతో కలుపును నిర్మూలించవచ్చు. విత్తిన 20, 40, 60 రోజులప్పుడు గుంటుకుతో దౌర కొట్టి అంతరకృషి చేయాలి. దీంతో పంటకు గాలి బాగా తగిలి ఏపుగా పెరుగుతుంది. మినుము, పెసర, సోయా పంటలను అంతరపంటగా వేసుకుంటే కలుపు ఉధృతి తగ్గడమే కాకుండా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది.

అధిక వర్షాలతో సాధ్యం కాకుంటే..

పంట మొలకెత్తిన 30 రోజుల నుంచి 50 రోజుల వ్యవధిలో వర్షాలతో అంతరకృషి సాధ్యం కాకుంటే కలుపు మొక్కలు విపరీతంగా పెరుగుతాయి. అలాంటి పరిస్థితుల్లో గడ్డి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే వాటి నివారణకు రసాయనిక మందులు వేసుకోవచ్చు. ఎకరాకు 200 లీటర్లలో 250 మిల్లీ లీటర్ల హిట్‌విడ్ కలిపి పిచికారీ చేయాలి. లేదా సర్వేసూపర్ 400 మిల్లీ లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవచ్చు.

రసాయనిక మందులతో..

రసాయనిక మందుల పిచికారీ ద్వారా పత్తి పంటలో కలుపు నివారణ సమర్థవంతంగా, చౌకగా నిర్మూలించవచ్చు. అయితే ఈ మందుల్ని సిఫారసు చేసిన మోతాదులో.. సూచించన సమయంలో వాడాలి. లేకుంటే కలుపు నివారణ మాట అటుంచి.. కొన్ని సందర్భాల్లో పంటకు నష్టం జరగవచ్చు. కాబట్టి స్థానిక వ్యవసాయాధికారి లేదా శాస్త్రవేత్త సలహా తీసుకొని కలుపు మందు పిచికారీ చేయాలి.

ఉద్యోగుల రక్షణకు ప్రాధాన్యమివ్వాలి


గనిలోకి దిగుతున్న ఎమ్మెల్యే పవార్, రఘునాథ్

నస్పూర్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల రక్షణకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మహారాష్ట్రలోని ఔసా నియోజకవర్గ ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయ పవార్ కోరారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిపై బీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ సింగరేణి గని కార్మికులకు రూ.400 కోట్లతో 10 వేల కొత్త క్వార్టర్లు నిర్మించి ఇస్తామని, ఉచితంగా తాగునీరు, కరెంట్, వడ్డీలేని రూ.10 లక్షల రుణం, అలియాస్ పేర్ల మార్పునకు అవకాశం, రిటైర్డ్ కార్మికులకు రెండు గుంటల భూమి తదితర హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆదాయపు పన్ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్కే6 గని లోపలికి దిగి భూగర్భంలో పని స్థలాలను పరిశీలించారు. వారి వెంట బీఎంఎస్ నాయకులు కడాసు భీమయ్య, బరపటి మారుతి, పంచెర్పుల నరేశ్, గొల్ల మహేందర్, గోపతి సందీప్, మిట్టపల్లి మొగిలి, సత్రం రమేశ్, కొండ వెంకటేశ్, సిరికొండ రాజు, కుర్రె చక్రి తదితరులున్నారు.


అర్ధ శతాబ్దం తర్వాత అరుదైన కలయిక


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 51 ఏళ్లకు కలిసిన చిన్ననాటి మిత్రులు

చెన్నూర్: అర్ధ శతాబ్దం క్రితం వారంతా ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్నారు. పదో తరగతి తర్వాత హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర పట్టణాలతోపాటు లండన్ లాంటి దేశాల్లో స్థిరపడ్డారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేసి విరమణ పొందారు. 51ఏళ్ల తర్వాత మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా శుక్రవారం వారంతా కలుసుకున్నారు. 1972 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం వేదికగా జరిగిన స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మిత్రులంతా ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వీరికి విద్యా నేర్పిన గురువులను స్మరించుకున్నారు. అనంతరం సన్మానాలు చేశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మిత్ర బృందం సభ్యులు కేపీఎం ప్రకాశ్‌రావు, కారెంగుల రామయ్య, మోతీలాల్‌దేవుడా, సుసర్ల రమేశ్, నాగోతు సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో 40 మందికి పైగా పాల్గొన్నారు.

లండన్ నుంచి వచ్చా..



చిన్నప్పుడు చెన్నూర్‌లోనే చదువుకొన్న. వైద్య కోర్సు చేసి లండన్‌లో ఎముకల వైద్యుడిగా పని చేస్తున్నా. అక్కడే స్థిరపడ్డా. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి లండన్ నుంచి వచ్చా. చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం సంతోషంగా ఉంది.

– ఓంప్రకాశ్ లాహోటీ, వైద్యుడు, లండన్

అవినీతి లేని సింగరేణి కోసం కృషి చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): అవినీతికి తావులేని సింగరేణి కోసం ఉద్యోగులు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయ ఆవరణలో కార్యాలయ ఉద్యోగులతో కలిసి విజిలెన్స్ అవగాహన వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థకు నష్టం వాటిల్లే చర్యలను సంస్థలో ఎవరూ ఉపేక్షించవద్దని సూచించారు. అవినీతి జరిగినట్లు తెలిస్తే వెంటనే దాన్ని అరికట్టేందుకు విజిలెన్స్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలు

ఉద్యోగంలో గుర్తింపు, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సింగరేణిలో అనేక అవకాశాలు ఉంటాయని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో మెడికల్ అన్‌ఫిట్ అయిన నలుగురు ఉద్యోగుల వారసులకు ఆయన కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, డీజీఎం ఫైనాన్స్ రామారావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, సెక్యూరిటీ మేనేజర్ వరప్రసాద్, డీవైపీఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ ఆశయసాధనకు ఉద్యమించాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: బీపీ మండల్ ఆశయసాధన కోసం ఉద్యమించాలని బీసీ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బిందేశ్వరీ ప్రసాద్ మండల్ 105వ జయంతిని తెలంగాణ బీసీ జాగృతి, బీసీ ఐక్యవేదిక నాయకులు ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. బీపీ మండల్ కమిషన్ సిఫారసులు పూర్తిగా అమలు చేసి బీసీల సంక్షేమానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్యభాస్కర్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, బీసీ నాయకులు చుంచు రాజ్‌కిరణ్, పడాల రామన్న, దుర్గం రాజేశ్, బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సీనియర్ నాయకులు కనుకుట్ల మల్లయ్య, విశ్వం, అంజయ్య, బుద్ధి చంద్రమౌళి, సమ్ము రాజన్న, శ్రీనివాస్, వేణుమాధవ్, తుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్ట్


మాట్లాడుతున్న డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో జరిగిన వరుస దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. శుక్రవారం ఐదుగురు నిందితులు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. శుక్రవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చెప్యాల వివేక్, దుర్గం గణేశ్, గూడెల్లి సాయికుమార్, దాసరి వినోద్, మేడిపల్లి అజయ్‌ను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ.. నిందితులు మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వర టెంపుల్ ఏరియాలో తాళం వేసిన ఇళ్లలో చొరబడి రూ.20 వేల నగదు దొంగిలించారని తెలిపారు. వేంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న ఇంటి తాళం పగులగొట్టి ఆరు తులాల బంగారం దొంగిలించారని పేర్కొన్నారు. ఆగస్టు మొదటి వారంలో వేంకటేశ్వర టెంపుల్ ఏరియాలో ఓ ఇంట్లో చొరబడి బీరువా నుంచి ఆరు తులాల వెండి, రూ.6వేల నగదు దొంగిలించారని తెలిపారు. సీఐఎస్‌ఎఫ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి బీరువా నుంచి బంగారు, వెండి నగలు, ఇత్తడి కొప్పెరను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఈ నెల 21న కమ్యూనిటీ హాల్ వద్ద ఓ ఇంట్లో చొరబడి టీవీ, మొబైల్ దొంగిలించారని తెలిపారు. అదేరోజు రాత్రి ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్ సమీపంలోని ఓ ఇంటి తాళం పగులగొట్టి టీవీ ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. శుక్రవారం బస్టాండ్ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మందమర్రి ఏరియా పోలీసులు రామన్‌కాలనీ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానంగా కనబడిన వ్యక్తులను పట్టుకుని విచారించగా నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి ఒక స్కూటీ, మోటార్ సైకిల్, రెండు టీవీలు, ఆరు తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ సదయ్య పర్యవేక్షణలో నిందితులను పట్టుకున్న మందమర్రి ఎస్సై చంద్రకుమార్, హెడ్ కానిస్టేబుల్ అజయ్, కానిస్టేబుళ్లు సంపత్, మహేశ్, రవి, అనిల్ కుమార్, రాము, సురేందర్, హోంగార్డు రవికుమార్‌ను ఈ సందర్భంగా డీసీపీ అభినందించారు.

ధర్నా విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన కాంట్రాక్ట్ కార్మికుల మహాధర్నాకు హాజరై విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపునిచ్చారు. పట్టణంలోని సివిల్ కార్యాలయంలో శుక్రవారం కాంట్రాక్ట్ కార్మికులతో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 60 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. సింగరేణిలో కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఇతర సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన మహాధర్నాలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి మల్లేశ్, శంకర్, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి


ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్న కల్వరీ చర్చి పాస్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ.. కల్వరీ చర్చి పాస్టర్ ప్రవీణ్‌కుమార్ చనిపోయిన వ్యక్తులను మళ్లీ బతికిస్తానని ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పాస్టర్ వీడియోలను చూసి ఆయనకు అతీత శక్తులున్నట్లు నమ్మి రాజమండ్రికి చెందిన ఓ నిరుపేద వ్యక్తి తనతల్లి మృతదేహాన్ని చర్చికి తీసుకువచ్చాడని తెలిపారు. తన తల్లిని బతికించాలని పాస్టర్‌ను వేడుకోవడానికి చర్చికి రాగా గేట్ వద్ద ఆపేశారని తెలిపారు. అమాయకులను నమ్మించి మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్న పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు కే గోవర్దన్, బీ కేశవరెడ్డి, అజ్మీరా శ్రీనివాస్, దూది ప్రకాశ్, నవీన్, శ్రావణ్, నర్సింగ్, రాజనర్సు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ


ఆసుపత్రిని సందర్శిస్తున్న అరవింద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ అరవింద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, సిబ్బంది వేళకు హాజరు కావాలని, కచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సరిగా వ్యవహరించాలని, ఏ వార్డు డాక్టర్ ఆ వార్డులోనే ఉండి చికిత్స చేయాలని, అందరూ ఒకే చోట ఉండవద్దని సూచించారు. సక్రమంగా విధులు నిర్వర్తించి ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. డాక్టర్ ప్రమోద్, నర్సింగ్ సూపరింటెండెంట్ జోస్పిన్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక


సమావేశంలో మాట్లాడుతున్న శేషాద్రి

భీమిని: కన్నెపల్లి మండలంలో 15 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై శుక్రవారం కన్నెపల్లి రైతు వేదికలో డీఆర్డీవో పీడీ శేషాద్రి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మార్చి 2021 నుంచి మార్చి 2023 వరకు రూ.7 కోట్లతో వివిధ రకాల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పలు గ్రామాల్లో పనుల్లో అవకతవకలు జరిగినందుకు గాను జరిమానాతోపాటు రికవరీకి ఆదేశించారు. కన్నెపల్లి, లింగాల, జన్కాపూర్, జజ్జరవెల్లి, మాడవెల్లి, పోలంపల్లి, టేకులపల్లి, గొల్లగట్టు, ముత్తాపూర్, రెబ్బెన, సాలిగాం, సుర్జాపూర్, వీరాపూర్ గ్రామాల్లో రూ.19 వేల జరిమానా, రూ.6,39,539 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాకేశ్‌శర్మ, అదనపు డీఆర్‌డీఏ దత్తరావు, ఏపీడీ శంకరమ్మ, ఎంపీడీవో రాధాకిషన్, ఏపీవో శ్రీనివాస్, ఎస్‌టీఎం నరేందర్, డీఈవో సురేశ్ పాల్గొన్నారు.

నిలిచిన ఆర్సీ, డీఎల్ కార్డుల ముద్రణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కార్డుల ముద్రణ నిలిచిపోయింది. గత పది రోజులుగా ముద్రణ యంత్రం చెడిపోవడంతో కార్డుల ముద్రణకు బ్రేక్ పడింది. రవాణా శాఖ కమిషనర్ ద్వారా మరమ్మతులు నిర్వహించే సిబ్బంది పది రోజుల్లో మూడుసార్లు జిల్లా కార్యాలయానికి వచ్చి వెళ్లినా వినియోగంలోకి రాలేదు. మదర్ బోర్డు, ఇతర భాగాలు పని చేయడం లేదని చెబుతున్నారు. దాదాపు వెయ్యికి పైగా ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌కార్డులు వాహనదారులకు అందించాల్సి ఉంది. స్టేషనరీ అందుబాటులో ఉన్నా ముద్రణ యంత్రం పని చేయక కార్డుల జారీ ప్రక్రియ నిలిచింది.

ఆర్టీవో ఎం–వ్యాలెట్ ఉన్నా..

వాహనదారులు చాలామంది మొబైల్ ఫోన్లలో ఆర్టీఏ ఎం–వ్యాలెట్ యాప్‌లో ఆర్సీ, రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. పోలీసుల వాహన తనిఖీల్లో ఎం–వ్యాలెట్‌లో చూపిస్తే యాప్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని వాహనదారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆండ్రాయిడ్ ఫోన్లు లేకపోవడం, ఎం–వ్యాలెట్‌పై అవగాహన లేకపోవడం కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. లైసెన్స్, ఆర్సీలు ఉన్నా జరిమానాలు కట్టాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే అందేలా చూస్తాం



ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల ముద్రణ యంత్రం మరమ్మతులు పూర్తి చేయించి కార్డుల ముద్రణ త్వరగా చేపట్టేలా చూస్తాం. వారం రోజుల్లో అందరికీ కార్డులు అందేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు ముద్రణ చేపట్టి వాహనదారులకు ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు చేరేలా చూస్తాం.

– వివేకానందరెడ్డి, ఇన్‌చార్జి డీటీవో, మంచిర్యాల

పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాములు

నస్పూర్: ఓటరు జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా తయారు చేయాలని మంచిర్యాల ఆర్డీవో రాములు సూచించారు. శుక్రవారం ఆయన సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మండలంలోని బూత్ లెవల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పీడబ్ల్యూడీ, వీఐపీ, ఓల్డ్ ఏజ్ ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్, ఆర్డీవో కార్యాలయ పీవో జ్యోత్స్న, బీఎల్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అన్నను చంపిన తమ్ముడు


తిరుపతి (ఫైల్)

బెజ్జూర్: అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడికి పాల్పడి హతమార్చిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కాటెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెరుగు తిరుపతి (45) మద్యం మత్తులో తల్లి గంగక్కపై చేయి చేసుకున్నాడు. దీంతో అక్కడే ఉన్న అతడి తమ్ముడు దేవన్న అడ్డొచ్చాడు. ఈ క్రమంలో తిరుపతి, దేవన్న మధ్య తోపులాట జరిగింది. తల్లిపైనే చేయి చేసుకుంటావా.. అని ఆగ్రహించిన దేవన్న తిరుపతిపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.